నామం వలననే మనం తరిస్తాము.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-09-05, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

పుస్తకాలు చదవటం వలననే ఆత్మజ్ఞానం రాదు. చదవటం వలన నీవు సంపాదించిన నాలెడ్జి ఆత్మజ్ఞానం పొందటానికి కొంతవరకు సహాయం చేస్తుంది. శరీరం, మాట, మనస్సు ఇవి మూడూ పనిముట్లు, వీటిని మనం ప్రోపర్‌గా ఉపయోగించుకోవాలి. మనం కంగారు పడితే ఆత్మజ్ఞానం వచ్చేయదు, పిందెని మనం కోసి ముగ్గేస్తే అది ముగ్గదు, కుళ్ళిపోతుంది. శరీరం, మాట, మనస్సు వీటిని మనం ప్రోపర్‌గా ఉపయోగించుకొంటూఉంటే నెమ్మదిగా, సహజంగా ఆత్మజ్ఞానం వస్తుంది. "ప్రతీవాడి మనస్సులో మంచి, చెడ్డ రెండూ ఉంటాయి. ఇందులో మనం దేనికి అన్నం పెడుతున్నాము అనేది మనం చూసుకోవాలి" అని బుద్ధుడు చెప్పాడు. మంచికి అన్నం పెడుతూ ఉంటే చెడ్డ తగ్గుతూ ఉంటుంది, చెడ్డకు అన్నం పెడుతూ ఉంటే మంచి తగ్గుతుంది. దేనికి అన్నం పెడుతున్నామో చూసుకోకుండా ఏవో పుస్తకాలు చదవటం వలన వచ్చేది సున్నా. చెడ్డకు అన్నం పెడుతూ రామా, రామా అంటే ఆత్మజ్ఞానం వచ్చేస్తుందా? మనం దేనికి అన్నం పెడుతున్నాము అనేది జాగ్రత్తగా చూసుకోవాలి, అదే నిజమైన సాధన. కొంతమందికి బాహ్యంగా కారణాలు ఏమీ కనబడవు, భయం వస్తూ ఉంటుంది. లోపల ఉన్న భయం కూడా చెడ్డలో భాగమే. అందువలన భయానికి కూడా ఫీడ్ చేయవద్దు. భయం ఎక్కువ అవ్వటం వలన మెంటల్ హాస్పటల్‌కు వెళ్ళాలి. వారు ఇచ్చే మందుల వలన భయం తగ్గదు, భయం అణుగుతుంది. రోగాన్ని అణచటం వేరు, రోగాన్ని తగ్గించుకోవటం వేరు. ఇతరులను చూసి అసూయపడటం ఎటువంటిదో భయం కూడా అటువంటిదే. హృదయంలో ఏమి జరుగుతుందో చూసుకోకుండా యాంత్రికంగా శివ, శివ అంటే సరిపోదు. శరీరం ద్వారా, మాటద్వారా, మనస్సు ద్వారా చెడుకు ఫుడ్ సప్లయి అవ్వకుండా చూసుకోవాలి, అదే సాధన.

మన దేహం చనిపోయే రోజుకు నూటికి నూరుపాళ్ళు ఆనందంలో ఉంటే ఇంక జన్మరాదు. మనం 99% ఆనందంలో ఉన్నా పునర్జన్మ వచ్చేస్తుంది. పుట్టుక వస్తే మరణం వచ్చేస్తుంది, అలా రిపీట్ అయిపోతూ ఉంటుంది. మనం రోజూ ఏడుస్తూ ఉంటాము, మనలో ఏడుపు ఇంకా ఉంటే ఏడవటానికి మరల పుడతాము. మనం ఏదైనా మంచి వాక్యం వింటే దానిని మనస్సులో తిప్పకోవాలి, అప్పడు అది మనస్సులో స్థిరపడుతుంది, అప్పడు మనలో ఉన్న మంచికి ఫుడ్ సప్లయి అవుతుంది. మనం కొంతమందిని ప్రేమించి, కొంతమందిని ప్రేమించలేకపోతే లోపల చెడు ఉందని అర్థం. దానిని మనం తొలగించుకోవాలి. పొయ్యిలో పుల్లలు మార్చి మార్చి పెడుతూ ఉంటాము, పుల్లలు మారుతూ ఉంటాయి, మంట కంటిన్యూ

అవుతుంది. అలాగే నీ సమస్యలు వేరువేరుగా ఉండవచ్చు కాని జన్మలు కంటిన్యూ అవుతూ ఉంటాయి. షేరింగ్, కేరింగ్, కైండ్‌నెస్ ఇవి మూడూ గుర్తుపెట్టుకోవాలి. మనలో ఎంతోకొంత కైండ్‌నెస్ ఉంటేనే ప్రజలతో షేర్ చేసుకోవాలనిపిస్తుంది. ఎప్పుడైతే షేరింగ్ వచ్చిందో అప్పుడు కేరింగ్ కూడా వస్తుంది. మనకు షేరింగ్, కేరింగ్, కైండ్‌నెస్ ఇవి మూడూ లేవు, ఈ అనారోగ్యాన్ని కవర్ చేసుకోవటానికి రామరామ అనటం నేర్చుకొన్నాము, యంత్రంలా తిప్పకొంటున్నాము కాని మనస్సును అక్కడ పెట్టటంలేదు. "నీవు ఇతరులను సుఖపెట్టాలన్నా, ఇతరులద్వారా నీవు సుఖపడాలన్నా ఎంతోకొంత కైండ్‌నెస్ ఉండాలి" అని వర్డ్స్‌వర్త్ చెప్పాడు. కైండ్‌నెస్‌ను సమాజానికి ఇస్తూఉంటే అది నీకు తిరిగి వస్తూఉంటుంది. దేవునికి మరో రూపమే ఈ సృష్టి. రోజూ మనం నిద్రపోయే ముందు ఒకటి చూసుకోవాలి. ఈరోజు మనం ఎన్ని మెర్సీ యాక్ట్స్ చేసాము, ఎన్ని క్రూయల్ యాక్ట్స్ చేసాము అంటే దయతో ఎన్ని పనులు చేసాము, క్రూరత్వంతో ఎన్ని పనులు చేసాము అది మీరు చూసుకోవాలి. ఒకవేళ క్రూరత్వంతో పనులు చేసినా బెంగపెట్టుకొని కూర్చోకుండా, అటువంటి పనులు రేపు చేయకుండా చూసుకోవాలి, వాటిని తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయాలి. శరీరం ఏదో రోజు చనిపోతుంది కాని లైఫ్ కంటిన్యూ అవుతుంది. అందువలన మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏవో మంచిపనులు చేయటం వలన లిబరేషన్‌రాదు, మంచిపనులు చేయటం వలన పుణ్యం వస్తుంది. మనకు సరియైన అవగాహన ఉండాలి. మనలో ఎవరికైనా సఫరింగ్ పూర్తి అయితే ఇంక వారికి పుట్టుక రాదు. ఇక్కడ సఫరింగ్ లేకుండా ఎవరైనా ఉన్నారా? మనం నోటితో సఫరింగ్ లేదు అని చెప్పినా లోపల అంతర్యామి ఉన్నాడు కదా ఆయన ఇదంతా చూస్తూ ఉంటాడు. లోపల సఫరింగ్ వస్తూ ఉంటే జీవితం కంటిన్యూ అవుతుంది.

'ఎవరైనా చెపుతూ ఉంటే వింటున్నాను కాని జ్ఞానం సంపాదించాలి అనే తపన రావటం లేదు' అని ఒకరు అడుగుతున్నారు. పూర్వజన్మల నుండి వచ్చిన పుణ్యబలం తక్కువగా ఉంటే ఆ తపన రావటం లేటు అవుతుంది, అలాగని శ్రవణం చేయటం మానకూడదు. 'పెద్ద పెద్ద తపస్సులు చేసి శరీరాన్ని, మనస్సును శుభ్రంగా ఎండబెట్టేసి వారు ఏస్థితిని పొందుదామని ప్రయత్నం చేస్తున్నారో, కృష్ణుడిని ప్రేమించి ఆస్థితిని నేను పొందాను' అని రాధ చెప్పింది. 'తపస్సులు చేసినవారు ఆస్థితిని పొందినా పొందకపోయినా, కృష్ణుడిపట్ల పవిత్రమైన ప్రేమ వలన నేను ఆ స్థితిని పొందాను' అంది రాధ. నీవు తపస్సు చేసి కోపం పెంచుకొంటూఉంటే దానివలన ప్రయోజనం ఏమిటి? నీవు తపస్సు చేస్తూ దేనిని ఫీడ్ చేస్తున్నావు? తపస్సు చేసేవారికి ప్రక్కన ఏదైనా డిస్టర్బెన్స్ వస్తే వారిని శపించేయాలి అనిపిస్తుంది. అంటే వాడు తపస్సు చేసి దేనికి ఫీడ్ ఇస్తున్నాడు అంటే చెడ్డకు ఫీడ్ చేస్తున్నాడు, చెడ్డకు ఆహారం అందుతూ ఉంటే తపస్సు వలన ప్రయోజనం ఏమిటి? అది మనం జాగ్రత్తగా వాచ్ చేసుకోవాలి. అందరూ మనలను

మెచ్చుకోవాలి అని ఎవరైనా అనుకొంటూ ఉంటే, అది లోకవాసన, ఇంక ఆ మనిషికి జ్ఞానంరాదు. అనుకొనేవాడు జీవుడు, నిర్ణయించేవాడు ఈశ్వరుడు. ఏదో మనస్సు ఉంది కాబట్టి అనుకొంటాము. నువ్వు కృషి మానవద్దు. ఫలితం ఈశ్వరుడి చేతిలో ఉందని కృషి మానివేస్తే పాడైపోతావు. అనుగ్రహించేది ఈశ్వరుడే, నా కృషి వలన వచ్చింది అనుకొంటే మరల నీకు గర్వం వస్తుంది, గర్వం వలన మనం పాడైపోతాము. శవం కనబడితే భయం వేస్తోంది అని ఒకరు నాన్నగారిని అడుగుతున్నారు. మీరు భయపడవద్దు, శరీరమే శవం అంతకంటే ఏమీ లేదు. మన శరీరం కూడా ఏదోరోజు శవం అవుతుంది. శవాన్ని కూడా మీరు గౌరవంగా చూడాలి. శవ సంస్కారం మీరు శ్రద్ధగా ప్రేమగా చేయాలి. శవాన్ని కూడా ముద్దు పెట్టుకొనేంత స్థాయికి మనం ఎదగాలి.

ఈరోజు మనకు శాంతిగా ఉండవచ్చు, రేపు అశాంతి రావచ్చు. ఈ రోజు సుఖంగా ఉన్నాము అనుకోండి, రేపు దుఃఖం రావచ్చును. మోక్షం అంటే శాశ్వతంగా దుఃఖం రాకూడదు. శరీరం ఉండగా దుఃఖం రాకూడదు, శరీరం మరణించాక కూడా దుఃఖం రాకూడదు. మీకు దుఃఖం వస్తూ ఉంటే మీరు చాలా బాగున్నారు అని ఇతరులు అంటే ఆ మాటల వలన ప్రయోజనం ఏముంది. అది ఎవరిమటుకు వారు చూసుకోవాలి, కాపీ కొట్టినట్లు ఉండకూడదు. మీరు తలపోటుతో బాధపడుతున్నారు అనుకోండి, మీకు తలపోటు లేదు, బాగున్నారు అంటే ఆ మాటలు ఎందుకు? వాటివలన ప్రయోజనం ఏమిటి? డబ్బును బట్టి దుఃఖం పోదు, మీరు లోపల దుఃఖంలేనిస్థితిని పొందాలి. లోకం గొడవలలోనికి అతిగా వెళ్ళవద్దు, మీకు ఎంతవరకు అవసరమో అంతవరకు వెళ్ళండి. బిందె నీళ్ళు మనం ఒకేసారి తాగము, మనకు ఎంతవరకు అవసరమో అంతే తాగుతాము. అలాగే లోకం గొడవలలో ఎంతవరకు అవసరమో అంతవరకే ఉండాలి, అతి పనికిరాదు. లోకం గొడవలలో అతిగా ఉంటే మీకు లోపల వెతుక్కోవటానికి టైము ఉండదు, ఈలోపు మీకు చావు వచ్చేస్తుంది. మీకు లోకవాసన ఉంటే ఎద్దు వెనకాల బండి ఎలా వస్తుందో, కారు వెనకాల దుమ్ము ఎలా వస్తుందో అలాగ మనిషి వెనకాల దుఃఖం వచ్చేస్తుంది. ఇప్పుడు బాగానే ఉన్నాము, మరల దుఃఖం వచ్చేస్తుంది, ఎందుకు వస్తోంది? అని జాగ్రత్తగా ఎవరికి వారు చూసుకోవాలి. దుఃఖం వస్తూఉంటే మనకు మోక్షం రానట్లే. దుఃఖం వస్తూఉంటే శరీరాలు వస్తాయి, శరీరం వస్తే మరల మరణం వచ్చేస్తుంది, దీనిని ఎవరు ఆపలేరు. కోటి రూపాయలు పెట్టి కిడ్నీ కొనుక్కోగలరు కాని కోటి రూపాయలు పెట్టి దుఃఖంలేనిస్థితిని కొనుక్కోలేము. మీరు ఇంటి దగ్గర కూర్చొని దుఃఖంలేనిస్థితిని పొందగలిగితే సరేసరి, అప్పుడు ఇంక మంచివారితో సహవాసం కూడా మీకు అక్కరలేదు. చేతినిండా డబ్బు ఉన్నప్పుడు బ్యాంక్‌లో నుండి అప్పులు తెచ్చుకోవటం ఎందుకు? అలా మీ అంతట మీరు పొందలేకపోతే మోక్షం పొందిన వారితో సహవాసం చెయ్యండి. అనుకరణ వద్దు, ఎవరి పద్ధతిలో వారు ఉండండి.

వారు అలా ఉన్నారు మనం కూడా అలా ఉండాలి అనుకొంటే చివరకు సున్న అయిపోతారు. మీకు సుఖం లేనప్పడు ఎవరో ఇతరులు మీరు బాగా ఉన్నారు అనుకోవటం వలన, అటువంటి మాటల వలన మీకు ఏమీ కలిసిరాదు.

కొంతమంది మంచిజన్మ రావాలి అని భగవంతుడిని కోరుకొంటారు. వారికి మంచిజన్మ రావచ్చు కాని మోక్షం రాదు. మంచి జన్మ వస్తే ఎంతకాలం ఉంటుంది? అది జాగ్రత్తగా చూసుకోండి. భగవంతుడు కూడా వారు అడిగినది వారికి ఇచ్చాము, అడగనిదాని గురించి మనకు ఎందుకు అని ఆయన ఊరుకొంటాడు. మీరు ప్రయాణించే మార్గం సరియైనది అయిఉండాలి, ఆ రోడ్డు కరెక్టు అయిఉండాలి. అంతేకాని మీరు మద్రాసు వెళ్ళాలి అనుకొంటూ బెంగుళూరు వెళ్ళే రోడ్డులో ప్రయాణం చేస్తూ ఉంటే ఎంత ప్రయాణం చేసినా మద్రాసు వెళ్ళలేరు. మీరు వెళ్ళే మార్గం కరెక్ట్ అయితే, మీరు నెమ్మదిగా వెళ్ళినా, కొంత లేటు అవుతుంది గాని గమ్యానికి చేరతారు. చనిపోయిన తరువాత ఉంటాము, ఉండము ఆ గొడవలు అనవసరం, ఇప్పడు దుఃఖంలేనిస్థితిని పొందటానికి ప్రయత్నం చేసుకోండి. మనం దుఃఖంలో ఉంటాము అనుకోండి, చనిపోయిన తరువాత కూడా మనం ఉంటే మాత్రం, దానివలన ప్రయోజనం ఏమిటి? లోకవాసన ఉందో, లేదో మనం లోపల చూసుకోవాలి. మీకు లోకవాసన ఉంటే సుఖంరాదు, దుఃఖంలేనిస్థితిని పొందలేరు. మీకు తాత్కాలికంగా సుఖం వచ్చినా లోకవాసన ఉన్నప్పడు ఆ సుఖం నిలబడదు. మోక్షం అంటే సుఖం శాశ్వతంగా ఉండాలి. ఇప్పడు సుఖంగా ఉండి, మరల దుఃఖం వచ్చేస్తూ ఉంటే అది మోక్షం కాదు. ఈ శరీరం చనిపోయినా జీవితం కంటిన్యూ అవుతుంది. జీవితం ఉన్నా అక్కడ దుఃఖం ఉన్నప్పడు ఆ జీవితాన్ని ఏమి చేసుకొంటారు. ఇప్పడు ఈ శరీరం ఆరోగ్యంగా ఉంది, ఇంకో గంటకు ఏదైనా రావచ్చు, మనస్సు కూడా అంతే. ఇప్పడు మనకు ఒక రూపం ఉంది, దానికి ఒకపేరు ఉంది, మరల ఇంకో రూపం వస్తుంది, దానికి ఒక పేరు ఉంటుంది, అలా రూపాలు, పేర్లు మారిపోతూ ఉంటాయి. మీకు దుఃఖం వస్తూఉంటే ఈ రూపాలను, నామాలను ఏమి చేసుకొంటారు. మీరు చాలా పెద్ద హాస్పటల్‌లో వైద్యం చేయించుకొన్నారు అనుకోండి, అయినా చనిపోతే ఆ హాస్పిటల్ వలన ప్రయోజనం ఏమిటి? మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, రామరామ అనుకొంటారు అనుకోండి, ఒక గంట ఆ దుఃఖం ఆగిపోతుంది, మరల దుఃఖం వచ్చేస్తుంది. ఇప్పడు మీకు ఒక లక్ష ఉంది అనుకోండి, దానిని పెంచుకోవాలని చూస్తున్నారు, అంటే మీ సంపదను అభివృద్ధి చేసుకోవాలి అని చూస్తున్నారు.

ఇప్పడు మీ మనస్సు ఏ స్థితిలో ఉందో దానిని దాటి అంతకంటే పైస్థితికి తీసుకొని వెళ్ళాలి అని ఎవరూ చూడటం లేదు, అక్కడ ఫెయిల్ అయిపోతున్నాము. సాధన చేసి పై స్థితికి వెళ్ళారు అనుకోండి చనిపోయిన తరువాత ఆస్థితి మనకూడా వచ్చేస్తుంది కాని భౌతికంగా

మీరు సంపాదించిన ధనం మాత్రం మరణానంతరం మీకూడా రాదు. 'మీ కూడా వచ్చే దాని గురించి వదిలేసి, మీకూడా రానిదాని గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకొంటున్నారు' అన్నాడు ఏసు. డబ్బు పెట్టి బంగారం, ఆస్తులు కొనుక్కోగలం గాని మోక్షం కొనుక్కోలేము, అది డబ్బుకు చేతకాని పని. సుఖం అంటే ఏమిటి? అని ఒక డాక్టరు గారు అడిగారు. మీరు ఉన్నారా? అని డాక్టరు గారిని అడిగాను, ఉన్నాను అని చెప్పారు. మీరు లేనప్పుడు, సుఖం అంటే ఏమిటో మీకు తెలుస్తుంది అని చెప్పాను. మీకు ఇంద్రియాలు ఉన్నా ఇంద్రియాలు లేనట్లుగా ఎవరు జీవిస్తున్నారో వారు సన్యాసి అని శాస్త్రంలో చెప్పారు. ఆ స్థితికి వచ్చాక ఇంక చూడటానికి, వినటానికి ఏమీ ఉండదు. కళ్ళు ఉన్నా కళ్ళులేని వాడితో సమానంగా, చెవులు ఉన్నా చెవిటి వాడితో సమానంగా ఎవడు ఉంటున్నాడో వాడు సన్యాసి. ఆచార్యులవారు భగవద్గీతకు భాష్యం వ్రాస్తూ కృష్ణుడు స్వయంగా భగవంతుడు అన్నారు. నూటికి నూరుపాళ్ళు శరీరం లేనివాడే కాని మనకోసం శరీరం ధరిస్తున్నాడు, శరీరంతో మనకు కనిపిస్తున్నాడు. ఆయన సాకారుడు అదే టైములో నిరాకారుడిగా కూడా ఉంటాడు. ఈ సాకారానికి, నిరాకారానికి అతీతంగా ఉన్నాడు, వాడికి నమస్కరిస్తూ ఈ భాష్యాన్ని ప్రారంభిస్తున్నాను అని ఆచార్యులవారు చెప్పారు. మనం ఈరోజు సంతోషంగా ఉన్నాము, మరల రేపు దుఃఖం వచ్చేస్తోంది, ఎందువలన? అని మనం చూసుకోవాలి. నదిలో నీరు ఎలా ప్రవహిస్తుందో అలాగ మనకు సుఖం ప్రవాహంలా ఉండాలి, బ్రేక్ అవ్వకూడదు. కోరిక వలన, కోపం వలన, భయం వలన మనకు దుఃఖంవస్తోంది. భయానికి కారణం ద్వైతం. అద్వైతానుభవం పొందేవరకు భయం వస్తూనే ఉంటుంది.

పూజలు చేయించుకొంటే బుద్ధిలోని దోషాలు పోతాయా? అని అడుగుతున్నారు. మీరు అడిగే ప్రశ్న ఎలాగ ఉంది అంటే లోపల కేన్సర్ ఉంటే పైన కొబ్బరినూనె వ్రాస్తే పోతుందా? కొబ్బరినూనె చేసే పని అది చేస్తుంది, చర్మాన్ని సాఫ్ట్ చేస్తుంది, కేన్సర్‌ను అది ఎలా తొలగిస్తుంది, దానికి సంబంధించిన వైద్యం చేయించుకోవాలి. దేహవాసనలో నుండి ద్వైతం వస్తుంది, రోగం అంతా అక్కడే ఉంది. గీతలో ఏమని చెప్పాడు అంటే నీకు రియలైజేషన్ వచ్చాక ఇంతవరకు నీవు విన్న విషయాల మీద, చూసే విషయాల మీద ఆసక్తి పోతుంది, చూడటానికి వినటానికి ఏమీ మిగలదు అన్నాడు. అంతటా నీరు దొరికేటప్పుడు ఇంక నీకు చెరువుతోటి, నూతితోటి పని ఏముంది? వాటి చుట్టూ తిరిగేపని నీకు ఎందుకు? అన్నాడు. మీకు ఎలా బాగుంటే అలా చెయ్యండి, మీరు ఆలోచించుకొని చెయ్యండి అని ఉపనిషత్ చెప్పదు, ఇలా చెయ్యండి అని డిక్టేట్ చేస్తుంది. నేను చెప్పేది చెప్పాను, నీ ఇష్టం అంటాడు కృష్ణుడు గీతలో. కానీ ఉపనిషత్ అలా చెప్పదు, శాసనమే. ఉపనిషత్‌లలో, వారు దర్శించి చెపుతున్నారు కాబట్టి ఇంక మనకు ఛాయిస్ ఇవ్వరు, శాసించటమే. భగవంతుడు మనకు ఇచ్చిన జీవితాన్ని సక్రమంగా ఉపయోగించుకోవాలి. శరీరాలు మారుతూ ఉంటాయి కాని జీవితం కంటిన్యూ అవుతుంది.

మీకు మోక్షం కావాలంటే సక్రమంగా జీవించండి, జీవితాన్ని ఎంజాయ్ చేయండి, ప్రకృతిని ఎంజాయ్ చేయండి, సత్పురుషుల సహవాసాన్ని ఎంజాయ్ చేయండి. మీరు నూటికి నూరు పాళ్ళు ఆనందంలోఉంటే, శాశ్వత సుఖంలో ఉంటే అప్పుడు ఇంక మీకు పునర్జన్మ ఉండదు. మీ పేరు మోహన అనుకోండి. మోహన కనిపిస్తూ ఉంటే ఆ కనిపించే మోహనకు పునర్జన్మ వస్తుంది. మోహన ఎక్కడ ఉంది అని వెదికినా మోహన కనబడకూడదు, అప్పుడు పునర్జన్మ నుండి విడుదల పొందుతావు. నీవు ఇతరులకు ఉపకారం చేయాలంటే పేరు కనిపించకపోతే ఉపకారం చేయగలవు.

మనకు ఏరకమైన దుఃఖం ఉన్నా పునర్జన్మ ఆగదు. ఈ శరీరం ఉండగా పాత దుఃఖం పోవాలి, కొత్త దుఃఖం రాకుండా చూసుకోవాలి, అదే సాధన. కాని మన పరిస్థితి ఎలాగ ఉంది అంటే పాత దుఃఖం పోగొట్టుకోలేకపోతున్నాము, కొత్త దుఃఖాలు తెచ్చుకొంటున్నాము, అవి ఇవి కలిపి ఎక్కువయిపోతున్నాయి. అంటే పాత అప్పులు తీర్చలేక పోతున్నాము, కొత్త అప్పులు చేస్తున్నాము. పాత దుఃఖాలు పోవటంలేదు, కొత్తవి వచ్చేస్తున్నాయి. ఈ చక్రంలోనుండి బయటకు రాలేకపోతున్నాము. ఇది ఎవరిమటుకు వారు చూసుకోవాలి. మీరు హిందువులా? క్రైస్తవులా? మీ శరీరం రంగు ఎర్రగా ఉందా? నల్లగా ఉందా? ఇటువంటి గొడవలు అంటే మీ మతం గురించికాని, మీ శరీరం రంగు గురించి కాని ఇవి ఏమీ భగవంతుడికి అక్కరలేదు, ఇవి అన్నీ చూసేవాడు జీవుడు. మీలో దుఃఖం ఉందా? లేదా? అని భగవంతుడు చూస్తాడు. రోజూ పూజలు చేయించుకొని కొత్త అప్పులు చేస్తూ ఉంటే ఎలాగ? కొత్త దుఃఖాలు రాకుండా చూసుకోవాలి, పాత దుఃఖాలు పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయాలి. శరీరానికి మరణం వచ్చేలోపు మన కప్పు నిండుగా ఉండాలి, కాఫీ కప్పు కాదు, సుఖం కప్పు నిండా ఉండాలి, అప్పుడు పునర్జన్మ ఆగుతుంది. భగవంతుడు ఆనంద స్వరూపుడు. ఆయన ఎంత ఆనందం పొందుతున్నాడో అంత ఆనందం మనం పొందితే గాని ఆయన స్వరూపం మనకు ఇవ్వడు, ఒకవేళ పేచీలు పెట్టుకొన్నా ఇవ్వడు, పేచీల వలన ఉన్నది పోతుంది. నీ దగ్గర డబ్బు ఉంది అనుకో సమాజానికి ఉపయోగపడగలవు, నీ దగ్గర డబ్బు లేకపోతే సమాజానికి ఏదైనా చేయాలన్నా చేయలేవు. జ్ఞానం కూడా అంతే. నీవు జ్ఞానం సంపాదిస్తే అది ఇతరులకు పంచి ఇవ్వగలవు. నీకే జ్ఞానం లేకపోతే ఇతరులకు ఏమి ఇవ్వగలవు. జ్ఞాన సముపార్జనకు, నీ కోసమే నీవు కష్టపడుతున్నా ఒక స్థితికి చేరుకొన్నాక నీవు పడిన కష్టం అది ఇతరులకు కూడా ఉపయోగపడుతుంది. బుద్ధుడు కూర్చొన్న చెట్టుకు నైవేద్యం పెట్టటంకోసం సుజాత అనే అమ్మాయి పాయసం తెచ్చి నైవేద్యం చెట్టుకు పెట్టకుండా, ఆ పాయసం బుద్ధుడికి ఇస్తుంది. బుద్ధుడు ఆ పాయసం తాగాడు లేకపోతే అప్పుడు ఆ శరీరం నిలబడదు. అప్పుడు బుద్ధుడు దగ్గర ఉన్నవారు బుద్ధుడు పాడైపోయాడని, ఆయనను వదలి సారనాథ్ వెళ్ళిపోయారు. బుద్ధుడు ఆ చెట్టు

కిందనే నిర్వాణస్థితిని పొందాడు. ఆ చెట్టు కింద జ్ఞానం పొందాము కదా అని ఆ చెట్టువంక రెప్పకూడా వాల్చకుండా వారం రోజులు చూస్తూ ఉండిపోయాడు. తరువాతగాని ఆ చెట్టును విడిచిపెట్టి వెళ్ళలేదు. ఆ కృతజ్ఞత చూడండి. తరువాత బుద్ధుడు తన దగ్గర నుండి పారిపోయిన వారి గురించి వెతుక్కుంటూ, వెతుక్కుంటూ సారనాథ్ వచ్చాడు. ఈయన పాడైపోయాడని అనుకొని ఈయనను విడిచి వెళ్ళిపోయిన వారిని వెతుక్కుంటూ వచ్చి మొదటి టీచింగ్ వారికే చెప్పాడు. ఆయన కృతజ్ఞత చూడండి. ఆయన చెప్పేది నిర్మలంగా చెపుతాడు, నీవు వినకపోయినా ఆయన ఆరోగ్యాన్ని పాడుచేసుకోడు. దేవుడు ఉన్నాడా? లేడా? అని అడిగితే ఉన్నాడు అని చెప్పడు, లేడు అని చెప్పడు. మీరు దుఃఖంలో ఉంటే దేవుడు ఉన్నాడు అని చెప్పినా ప్రయోజనం ఏమిటి? ముందు మీరు దుఃఖంలో నుండి విడుదల పొందాలి. ఈ మధ్య ఒకరికి కేన్సర్ వచ్చింది. 6 నెలల కంటే బతకడు అని చెప్పారు. మీరు ఏమి చేసుకొంటున్నారు అని అడిగితే బాకీలు వసూలు చేసుకొంటున్నాను అని చెప్పాడు. నువ్వు నూటికి నూరుపాళ్ళు ఆనందంలో ఉంటే ఇతరుల గొడవలు అసలు రావు, నీకు సుఖం లేనప్పుడు దానిని కవర్ చేసుకోవటానికి ఇతరుల గొడవలు ఏవో వేసుకొని తిరగటం, నీకు ఆనందంగా ఉంటే ఏ గొడవ లేదు, నీవు ఆనందంగా లేకపోవటం వలన లోకం గొడవలు అన్నీ వస్తున్నాయి.

నాకు జ్ఞానం ఇమ్మని బుద్ధుడి కుమారుడు బుద్ధుడిని అడిగాడు. బుద్ధుడు 5 ని॥లు నిర్మలంగా ఉన్నాడు. తరువాత కుమారుడితో ఒక పళ్ళెం నిండా నీరు పోసుకొని తెమ్మని చెప్పాడు. పళ్ళెం తెచ్చాక బుద్ధుడు తన రెండు కాళ్ళు పళ్ళెంలో పెట్టి, 2 ని॥ల తరువాత కాళ్ళు తీసేసాడు. ఆ నీటిలో నీకు నలకలు కనిపిస్తున్నాయా అని కుమారుడిని అడిగాడు, కనిపిస్తున్నాయి అని కుమారుడు చెప్పాడు. అటువంటి నలకలు నీ బుద్ధిలో ఉన్నాయి, అవిపోతే నీకు జ్ఞానం వస్తుంది అని చెప్పాడు. వాటిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చెయ్యి, అవి పోతాయి, అప్పుడు జ్ఞానం వస్తుంది అన్నాడు. జ్ఞానం అనేది బుద్ధుడితో ఆగిపోకూడదు, రాబోయే జ్ఞానులకు కూడా నమస్కారం అన్నాడు బుద్ధుడు. మీకు కావలసింది వెలుతురు, ఏ లైటు అయితేనేమి? మిమ్ములను ఉద్ధరించటానికి అవసరమైతే ఇంకో బుద్ధుడు వస్తాడు అని చెప్పాడు. నేను వస్తాను, నేను మరల అవతరిస్తాను ఇటువంటి మాటలు బుద్ధుడు చెప్పలేదు. ఇప్పుడు ఒక చెట్టు మనకు టీచ్ చేస్తోంది అనుకోండి, నేను ఏదో చెప్పేస్తున్నాను అని అది అనుకోదు, బుద్ధుడి టీచింగ్ కూడా అలాగే ఉంటుంది. వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని అనుకొంటూ ఉంటే దాని అర్థం ఏమిటి అంటే నీకు సుఖం లేదు అని అర్థం. ఇప్పుడు సగం నిండి ఉన్నా శరీరం మరణించేటప్పటికి మన కప్ప సుఖంతో పూర్తిగా నిండిపోవాలి, అప్పుడు ఇంక పునర్జన్మ ఉండదు. మనకు పుట్టుక అంటే ఇష్టం, మరణం అంటే ఇష్టం ఉండదు. ఇష్టం అయినది కోరుకొన్నప్పుడు, ఇష్టం లేనిది కూడా వచ్చేస్తుంది. బుద్ధుడు శిష్యులలో ఒకడు చాలా

మంచివాడు ఉండేవాడు. ఎవరైనా వాడిని రమ్మని అడిగితే ఇప్పుడు రానండి, అవసరమయి నప్పుడు వస్తాను అని చెప్పేవాడు. అంటే ఇప్పుడు మీరు సుఖంగా ఉన్నారు కదా, మీకు ఎప్పుడైనా కష్టంగా ఉన్నప్పుడు వస్తాను అని అర్థం, అది మంచితనానికి పరాకాష్ట. మనం అయితే బాగున్నప్పుడు వారి కూడా తిరుగుతాము, వారికి ఏదైనా కష్టం వచ్చినప్పుడు వదిలేస్తాము.

మనం అవసరమైతే మాట్లాడాలి కాని వాదనకోసం ఎప్పుడూ మాట్లాడకూడదు. ఈ మధ్య ఒకచోట నేను ఎవరిగురించో చెపుతూ ఆయన చాలా ఎర్రగా ఉంటాడు అన్నాను, అవతలివ్యక్తి కాదనలేదు కాని ఎర్రటి తేలు అన్నాడు. అంటే శరీరం ఎర్రగానే ఉంది కాని మనస్సు తేలులాంటిది, ఎక్కడ దొరికితే అక్కడ కాటువేసేస్తాడు అని చెప్పటం. వీరందరూ మనకు గురువులే. పుస్తకాలు చదివి మనం నేర్చుకొనే పాఠాలకంటే ప్రకృతి మనకు ఎక్కువ పాఠాలు చెపుతుంది. నీవు ఇతరులను సుఖపెట్టాలనుకొన్నప్పుడు, ఇతరుల వలన నీవు సుఖపడాలనుకొన్నప్పుడు దయను ప్రాక్టీసు చెయ్యాలి. మనలోపల సూక్ష్మ శరీరం ఉంది, అది మన కళ్లకు కనబడదు. అది ఒంటరిగా ఉండదు. ఇంద్రియాలను జత వేసుకొని ఇష్టాలను, అయిష్టాలను తీర్చుకొంటూ, కోరికలు తీర్చుకొంటూ ఉంటుంది. ఒకరికి ఉపకారం చేస్తుంది, ఒకరికి అపకారం చేస్తుంది, ఒకరిని ముద్దు పెట్టుకొంటుంది, ఒకరిని మొట్టుతూ ఉంటుంది, ఇలా ఏదో ఒకటి చేస్తూ ఉంటుంది. దానికి ఎంతసేపు కోలాటం ఉండాలి, ఏవో గొడవలు వేసుకొని తిరుగుతూ ఉంటుంది, మీరు పాటలు బాగా పాడారు అంటే అది లోపల ఫుడ్ తీసుకొంటూ ఉంటుంది. మంచి పనులు చేయండి, పుణ్యం సంపాదించుకోండి, నా జోలికిమటుకు రాకండి అని చెపుతుంది, పుణ్యం వలన వచ్చే ఫలితాన్ని ఎంజాయ్ చేయటానికి మరల అది ఉండాలి కదా అందుకు అలా చెపుతుంది. నిప్పు సూక్ష్మశరీరాన్ని కాల్చలేదు, ఆత్మజ్ఞానం మాత్రమే దానిని కాల్చుతుంది. సూక్ష్మశరీరం పూర్తిగా కాలిపోయే వరకు పునర్జన్మలు ఆగవు. భగవంతుడు ఉన్నాడు అని అంటాము అనుకోండి, ఆయనను తెలుసుకొనే ప్రయత్నం చేయలేకపోతే భగవంతుడు ఉన్నాడని అంగీకరించినా దానివలన ప్రయోజనం లేదు. సర్వానికి కర్త ఈశ్వరుడు. సర్వ కర్తృత్వం, సర్వ భోక్తృత్వం ఆయనే అయినప్పుడు మనకు ఎందుకు దుఃఖం వస్తోంది? నేను చేస్తున్నాను అని అనుకోవటం వలన దుఃఖం వస్తోంది. నేను చేస్తున్నాను అని అనుకోవటానికి కారణం దేహబుద్ధి. జరిగేది భగవంతుడి నిర్ణయమే అయినా నేను చేస్తున్నాను అనుకోవటానికి దేహబుద్ధే కారణం. భగవాన్ ఒకమాట చెప్పారు దేహం తప్పలు చేయదు, దేహం నేను అనే తలంపు తప్పలు చేస్తుంది. తప్పలు చేసేది దేహము నేను అనే తలంపు, దెబ్బలు తినేది దేహం. దేహం నేను అనుకోవటంలోనే కర్తృత్వం వచ్చేస్తుంది.

దేహము నేను అనే తలంపులోనుండి బయటపడలేకపోతున్నాము. ఈ చిన్నగెడప దాటలేకపోతున్నాము. మనకు అన్నీ ఉన్నాయి అయినా మనం సుఖంగా ఉండలేకపోతున్నాము,

ఎందువలన? దానికి మనలో ఉన్న అజ్ఞానం కారణం. మనలో ఉన్న అజ్ఞానమే కోతి బావ. దానికి చపలత్వం ఉంటుంది. అసలే అది కోతి, మరల సారా తాగింది అనుకోండి చాలా దారుణంగా ఉంటుంది. ఇంక దానిని తేలు కుట్టింది అనుకోండి, అది ఎంత గొడవ చేస్తుందో చూడండి. మన మనస్సు కూడా అలాగే ఉంది, టీచింగ్‌కు ప్రాముఖ్యత ఇవ్వాలి. శ్రవణం చేయటం వలన రోగం తగ్గకపోయినా, రోగాన్ని తెలుసుకోవచ్చు, మన మనస్సులో ఏమి ఉందో మనకు తెలుస్తుంది. మనం దేవుడిని ఎందుకు తెలుసుకోలేకపోతున్నాము అంటే ఆయనకు సెపరేట్‌గా ఉండాలి అనుకొంటున్నాము, మనకు వేరు కాపురం అంటే ఇష్టంగా ఉంది, అందుచేత ఆయన దూరం దూరంగా ఉంటున్నాడు. మనం ఏ మెతుక్కి, ఆ మెతుకుగా ఉండాలి అనుకొంటున్నాము కాని మెతుకులు అన్నీ కలిసి ముద్దగా ఉండటానికి ఇష్టపడటం లేదు, ముద్దగా అయిపోతే మనకు అస్థిత్వం ఉండదని భయం. కోరికలు నెరవేరినప్పడు ఆనందం వస్తోంది కదా మామూలుగా ఎందుకు రావటంలేదు. మనకు ఏదైనా కోరిక తీరితే అందులోనుండి ఆనందం వస్తుంది, అది తాత్కాలికం. ఒక కోరిక నెరవేరింది అనుకో అది అక్కడితో ఆగదు, ఒక వెయ్యి కోరికలను తీసుకొని వస్తుంది. ఇలా కోరికలు తీర్చుకొంటూ మోక్షం పొందినవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. పూర్వం ఇలా కోరికలు నెరవేర్చుకొంటూ వెళ్ళారు, వారికి ముగింపు దొరకలేదు, ఇలా కోరికలు నెరవేర్చుకొనేకొలది దుఃఖం పెరుగుతోంది. నెరవేరిన కోరికలు అక్కడితో ఆగకుండా ఇంకా కోరికలను తీసుకొనివస్తాయి. ఇలా కోరికలను సంతృప్తిపరిచేకొలది దుఃఖం ప్రారంభమయింది. ఇవి చూసి చూసి విసుగెత్తి లోపలకు వెళ్ళటం మొదలుపెట్టారు. లోపలకు వెళ్ళటానికి కూడా దుఃఖం కారణం కదా. దుఃఖం లోపలకు తీసుకొని వెళుతుంది. అర్జునుడికి దుఃఖం రావటం వలన ఆయన యోగి అయ్యాడు, మనకు దుఃఖం వస్తే రోగులమవు తున్నాము. మీకు బాబా అంటే ఇష్టం అనుకోండి, మంచిదే, అయితే మా అందరి దగ్గర ఆనందంగా ఉండలేకపోతే మీలో ఏదో బలహీనత ఉంది అని గుర్తు, దానిని తొలగించు కోవాలి.

దేవుడు అంతటా ఉంటే కొన్ని స్థలాలలోనే వైబ్రేషన్స్ ఎక్కువగా ఎందుకు ఉన్నాయి? ఇప్పడు లైటు ఉంది అనుకో దాని కాంతి గది అంతా ఉంటుంది కాని లైటుకు దగ్గరగా మనం ఉంటే ఆ కాంతి ఎక్కువగా ఉంటుంది. పుణ్య క్షేత్రాలలో ఎంతోమంది పరమపవిత్రులు అక్కడ తపస్సులు చేసారు, జీవించారు. వారికి మనస్సు ఉన్నా మనస్సు లేనివారితో, ఇంద్రియాలు ఉన్నా ఇంద్రియాలు లేనివారితో సమానంగా ప్రకృతిని దాటి జీవించారు కాబట్టి అవి పుణ్యక్షేత్రాలు అయ్యాయి, వారి వైబ్రేషన్స్ అక్కడ పనిచేస్తాయి. శరీరానికి ఏదైనా రోగంవస్తే రోజూ బాధపడుతూ కూర్చోకూడదు, ఆ రోగాన్ని తొలగించుకొంటే చాలు. అలాగే మనస్సులో ఉన్న దోషాలను తొలగించుకోవాలి. ఎటాచ్‌మెంట్‌లోనుండే మనకు రోగాలు, దుఃఖాలు వస్తాయి. ప్రేమవేరు, బంధం వేరు. ప్రేమ నిన్ను బంధించదు, ఎటాచ్‌మెంట్ నిన్ను బంధిస్తుంది. మనకు ఉన్నది

ఎటాచ్‌మెంట్‌గాని ప్రేమకాదు. ప్రేమ మనకు కాంతిని ఇస్తుంది, ఎటాచ్‌మెంట్ మనలను చీకటిలోనికి తీసుకొనిపోతుంది. మనం అనుకొనేది ఏదీ నిజం కాదు. మనకు నిజం ఎలా ఉంటుందో తెలియదు. తెలియనివారము తెలియనట్లు ఉంటే పరవాలేదు కాని మనకు తెలిసినదే నిజం అనుకొని ప్రమాదంలో పడతాము. మనం కోరికను నెరవేర్చేకొలది అనేక కోరికలు వస్తూ ఉంటాయి, నెరవేర్చకపోతే ఏ గొడవ లేదు. నీవు ప్రపంచానికి ఉపయోగపడాలంటే, ఏదైనా చేయాలి అంటే ముందు నీ తలకాయలో ఉన్న ప్రపంచాన్ని విడిచిపెట్టాలి. అంటే నీవు క్రియేట్ చేసుకొన్న ప్రపంచాన్ని వదులుకోవాలి. ప్రతీ మనిషికి వాడి తలకాయలో ఏదో ఒక ప్రపంచం ఉంటుంది, ఒక్కో తలకాయకు ఒక్కో పిచ్చి. మనందరం ప్రపంచం అనే పిచ్చి ఆసుపత్రిలో ఉన్నాము. ఈ పిచ్చి ఉన్నంతకాలం పునర్జన్మలు వచ్చేస్తూ ఉంటాయి. ఎవడి ప్రపంచంలో వాడు ఉంటే ఇంక సమాజానికి ఏమి ఉపయోగపడగలము. నువ్వు ప్రపంచానికి నిజంగా ఉపయోగపడాలంటే నీ తలకాయలో ఉన్న ప్రపంచాన్ని ముందు విడిచి పెట్టు.

కోరికలు తీర్చుకోవటం వలన వచ్చేది సుఖం కాదు, ఆనందం కాదు, అది సంతోషం. సంతోషం వేరు, సుఖం వేరు. సంతోషం అలా ఉన్నా పరవాలేదు, అది వెళ్ళి దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. మనం ఇలా ప్లెజర్, పెయిన్‌లలో తిరుగుతూ ఉంటాము, ఏదోరోజు శరీరానికి చావు వచ్చేస్తుంది. నీవు కోరికను నెరవేర్చకుండా, దానిని కంట్రోలు చేస్తే అప్పుడు నీకు సంతోషం రాదు, ఆనందం వస్తుంది. ఇప్పుడు మనం అందరం ఎక్కడో ఒకచోట పుట్టేసాము, అందువలన చుట్టాలను సెలెక్టు చేసుకోవటం కుదరదు. మనం స్నేహితులను, పుస్తకాలను జాగ్రత్తగా సెలెక్టు చేసుకోవాలి. ఆనందం వేరు, సంతోషం వేరు. ఆనందం ఇప్పుడు రావాలంటే రాదు, నీ బుద్ధి శుద్ధి అయ్యాక నీకు ఆనందం అందుతుంది. అంతవరకు సంతోషాన్నే ఆనందం అనుకొంటాము, అది ప్రమాదం. అసలు డిస్ట్రబెన్స్ అంతా మనస్సులోనే ఉంది. మనస్సును అతిక్రమిస్తే మన ద్వారా ప్రపంచానికి మేలు జరుగుతుంది, మనం చేయాలి అని కర్తృత్వం పెట్టుకోనక్కరలేదు. నువ్వు లైట్ అయ్యావు అనుకో నీ ద్వారా అనేక దీపాలు వెలిగించుకోవచ్చు. అక్కడ ఉన్న దీపాన్ని బట్టి మిగిలిన దీపాలను వెలిగించుకోవాలి కాని ఉన్న దీపాన్ని ఆర్పివేయకూడదు. ఎంజాయ్‌మెంట్ వేరు, పెర్‌ఫెక్షన్ వేరు. మనం ఎంజాయ్ మెంట్ రోడ్డులో ప్రయాణం చేస్తున్నాము, కాని ఆశించేది పెర్‌ఫెక్షన్‌ను ఆశిస్తున్నాము. ఈ రెండింటికి పొంతన కుదరదు. మీరు వివేకాన్ని పెంచుకోండి, మీ యొక్క చైతన్యస్థాయిని పెంచుకోండి. మనం హైద్రాబాద్‌లో ఉన్నప్పుడు ఒకలాగ, వైజాగ్‌లో ఉన్నప్పుడు ఒకలాగ, అరుణాచలంలో ఉన్నప్పుడు ఒకలాగ ఉంటే మన మనస్సులో ఏదో డిస్ట్రబెన్స్ ఉంది అని అర్థం. నువ్వు సమాజంలో ఒకరిని ప్రేమించి, మరొకరిని ప్రేమించలేకపోతే నీ మనస్సులో ఏదో బలహీనత ఉంది, దానిని తెలుసుకొని, దానిని తొలగించుకోవాలి. ప్రేమ వేరు, బంధం వేరు. మనం బంధాన్ని ప్రేమ అనుకొని చీకటిలో

కూరుకొనిపోతున్నాము. మనకు సత్యం తెలియటం లేదు అని అనుకోవాలి కాని సత్యంకానిదానిని సత్యం అనుకొంటే డేంజర్‌జోన్‌లోనికి వెళ్ళిపోతాము, మనరోగం ముదిరిపోతుంది, టేబ్లెట్‌లకు తగ్గిపోయేది సర్జరీ చేయవలసి వస్తుంది.

మనకు భయం ఎందుకు వస్తోంది? భయం వస్తూ ఉంటే నష్టం ఏమిటి? భయం వలన దుఃఖం వస్తుంది. మనం ఉన్నాము అని అనుకోవటం వలన మనకు భయం వస్తోంది. మనం లేము అన్నసంగతి తెలిస్తే భయంపోతుంది. నిజంగా మనం లేము కాని ఉన్నాము అని అనుకోవటం వలన ఇన్ని గొడవలు వస్తున్నాయి. ఇవి అన్నీ నిజంగా రావటం లేదు, అనుకోవటం వల్ల వస్తున్నాయి. ఆ క్లూ నీవు పట్టుకోవాలి. అది పట్టుకొంటే నీద్వారా కాంతి, శాంతి ప్రవహిస్తుంది. దీపం చీకటినివ్వదు, వెలుతురునిస్తుంది. చీకటి గురించి బోధించటం ఎందుకు? చనిపోవటం గురించి బోధించటం ఎందుకు? వెలుతురు గురించి బోధించాలి, జీవితం గురించి బోధించాలి. జననమరణచక్రంలో నుండి మనం జాగ్రత్తగా విడుదలపొందాలి. కంగారు పడకూడదు, కంగారుపడితే మనకే నష్టం, ఉన్నది పోతుంది, అందుచేత నెమ్మదిగా ఈ చక్రంలో నుండి బయట పడాలి, ఇప్పడు మనం బయట వెతుక్కొనేది లోపల వెతుక్కొంటే మనకు జ్ఞానం వచ్చేస్తుంది. కుండలోపల అన్నం ఉంది అనుకోండి, పైన మూత ఉంటే లోపల అన్నం ఉన్నా మనకు కనబడదు. అలాగే మన హృదయంలో ఆనందం ఉంది. మనకు తెలిసినా, తెలియకపోయినా ఆనందం మన హృదయంలో ఉంది. మనం ఉన్నాము అని అనుకోవటం వలన అది మనకు తెలియటం లేదు, మనం లేము అన్న సంగతి మనకు తెలిస్తే ఆనందం మనకు అందుతుంది, అంటే ఆ మూతను తీసి ఒక ప్రక్కన పెట్టాలి. మనకు అశాంతి ఉంది అనుకో, ఆ సమస్యను పరిష్కారం చేసుకోకుండా స్వర్గానికి వెళ్ళిపోదాము అంటే ప్రయోజనం ఏముంది. లోపల ఉన్న శాంతి మీకు దొరికింది అనుకోండి, అప్పడు ఇంద్రుడు కనబడి స్వర్గానికి తీసుకొనివెళ్తాను అన్నా వద్దు అని చెపుతారు. మీకు బంగారం గురించి తెలుసు అనుకోండి. ఎవరైనా పెంకుముక్క తెచ్చి ఇచ్చి బంగారం మంచిది కాదు, ఇదే మంచిది అని చెప్పినా దానిని మీరు తీసుకోరు ఎందుచేత బంగారం గురించి మీకు తెలుసుకాబట్టి, అదే తెలియకపోతే తీసేసుకుంటాము. చిన్నపిల్లలు అలాగే చేస్తారు, మన చేష్టలు చిన్న పిల్లల చేష్టలులాగవున్నాయి.

ఏదో చేయటం వలన పుణ్యం రావచ్చుగాని జ్ఞానంరాదు. పుణ్యం వలన స్వర్గానికి వెళతారు, అక్కడ కొంతకాలం ఉన్నాక వెళ్ళి రమ్మంటారు. ఇప్పడు మీరు సినిమాకు వెళ్ళారు అనుకోండి అది చాలా బాగుంది అనుకోండి అయినా అక్కడ ఉండనివ్వరు, రెండు గంటలు సినిమా అయిన తరువాత వెళ్ళి రమ్మంటారు. స్వర్గలోకం అయినా అంతే, అక్కడకు వెళ్ళటానికి వళ్ళంతా బాడి చేసేసుకొంటున్నారు. మీకు ఇంటి దగ్గర టెన్షన్ ఉంది అనుకోండి. అది తగ్గించుకోవటానికి సినిమాకు వెళతారు. ఆ సినిమాలో రెండు గంటలు ఉంటారు, మరల

ఇంటికి రాగానే టెన్షన్ వచ్చేస్తుంది. ఏదో తాత్కాలికంగా కొద్ది టైము తగ్గటం కాదు కదా, పెర్మనెంట్ క్యూర్ చూసుకోవాలి కదా అంటే అది పూర్తిగా తగ్గేవిధానం చూసుకోవాలి, టెన్షన్ తగ్గటానికి కొంతమంది సారా తాగుతారు. దాని వలన ఇల్లు గుల్లవుతుంది, వల్లు గుల్లవుతుంది. అసలు ఈ టెన్షన్ ఎందుకు వస్తోంది? దానికి కారణం ఏమిటి అని చూసుకోవాలి. నీకు టెన్షన్ రానియ్యి, తొంబై గొడవలు రానియ్యి, నువ్వు ఉండటం వలన ఇవి అన్నీ వస్తున్నాయి. ఆ ఉండేది ఎవరో చూడు, అది తెలిస్తే ఏమీ లేదు. ఇక్కడ ఆగటం మానేసి రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా నొల్లుకొస్తున్నావు. అసలు సమస్యను వదిలేసి ఎక్కడో గుళ్ళు కట్టిస్తాను అంటావు, కట్టిస్తేకట్టించవచ్చుగాని అసలు నీసమస్య ఏమిటి? దానిని పరిష్కారం చేసుకోవటానికిచూసుకో.

మీరు పాటలు బాగా పాడుతున్నారు అంటే మీకు సంతోషం వస్తుంది, పొంగు వస్తుంది. ఆ పొంగేది ఎవరు? అది చూసుకోండి. ఈ మాటలు అనకముందు నీవు ఎలాగ ఉన్నావో ఈ మాటలు విన్న తరువాత కూడా నీవు అలాగే ఉండగలిగితే అంటే నీవు ఒకేలాగ ఉంటే నీవు సత్యాన్ని రిసీవ్ చేసుకోవటానికి ఫిట్ అవుతున్నావు. ఒకవేళ నీవు పొంగుతూ ఉంటే సత్యాన్ని రిసీవ్ చేసుకోవటానికి నీవు ఫిట్ అవ్వలేదని అర్థం, నీకు ఒకవేళ సుఖస్థానం దొరికింది అనుకో, నీ శరీరం మరణించినా ఆ సుఖం బ్రేక్ అవ్వదు, సుఖం అలా కంటిన్యూ అయిపోతుంది. మరల నీకు దేహం వచ్చినా సుఖం అలా కంటిన్యూ అవుతుంది. త్యాగి కానివాడు జ్ఞాని కాలేడు, జ్ఞాని కానివాడు సుఖి కాలేడు, సుఖి కానివాడికి జన్మ ఆగదు, పునర్జన్మ వచ్చేస్తుంది. మనకు ఇష్టంలేని వస్తువును విడిచిపెట్టటం త్యాగంకాదు, మనం ఆముదం విడిచిపెట్టేసాము అనుకోండి అది త్యాగం కాదు. త్యాగం అంటే మన మనస్సుకు బాగా ఇష్టమైనది, జ్ఞానం పొందటానికి అడ్డువచ్చేది విడిచిపెట్టటం త్యాగం. శ్రద్ధలేని శ్రార్థాలు ఎందుకు అని అంటారు. మనం చేసేపనిలో శ్రద్ధ ఉండాలి కదా. ఇంట్లో వారు ఏమనుకొంటారు, ఇతరులు ఏమనుకొంటారు అని తద్దినాలు పెట్టటం ఎందుకు? ఎప్పుడూ కూడా మనకు పనికిరాని వస్తువులను ఇతరులకు ఇవ్వకూడదు. అలా ఇవ్వటం వలన వచ్చే జన్మలో అందరూ పనికిరాని వస్తువులు మనకు ఇచ్చేటట్లు ఈశ్వరుడు చేస్తాడు. మనం ఏవైతే ఇతరులకు ఇచ్చామో అవే భగవంతుడు మరల మనకు ఇస్తాడు. ఆ పనికి రాని వస్తువులు అన్నీ తిరిగి మనకే వచ్చేస్తాయి అని మనకు తెలియటం లేదు. మనం ఏవైతే ఇతరులకు ఇచ్చామో వాటినే మనచేత తినిపిస్తాడు. అందువలన బహుజాగ్రత్తగా ఉండండి. మనం ఏదైతే ఆక్షేపించామో అదే మనకు తిరిగి వస్తుంది. ఎవడైనా కుంటోడు ఉన్నాడు అనుకోండి, వాడిని కుంటోడా అని పిలువకూడదు, ఎప్పుడూ పేరు పెట్టి పిలవాలి. వాడిని కుంటోడా అని పిలిస్తే ఆ కుంటితనం మరల మీకు వచ్చేస్తుంది. కొంతమంది ఒంటరిగా ఉన్నప్పుడు బాగా తినేస్తారు, పదిమందిలో ఉన్నప్పుడు వద్దు వద్దు అంటారు, పక్కన ఉన్నవాడిని కూడా చెడగొడతారు. ఇది అంతా మన బుర్రలో

ఉన్న దోషం, దానిని సరిచేసుకోకుండా ఏదో చెట్టు చుట్టూ తిరిగి వచ్చేసాము అంటే అర్థం ఏమిటి? నిన్ను నీవు బాగుచేసుకోవటానికి ప్రయత్నం చేసుకో. దైవసహాయం వస్తే తీసుకో, రాదు అనుకో ఎదురుచూడవద్దు, నీ ప్రయత్నం నీవు చెయ్యి. ఇవన్నీ భగవంతుడు చెప్పాడు. వినటానికి టైము లేదు మేము బిజీగా ఉన్నాము అంటే ఏమిటి? పనీపాటులేనివాడు బిజీ బిజీ అంటాడు. కష్టపడి పనిచేసుకొనే వాడికి కొంత విశ్రాంతి ఉంటుంది, దేవుని మాటలు వింటాడు. శరీరానికి మరణం వచ్చింది అనుకోండి, అప్పుడు మేము బిజీగా ఉన్నాము అన్నా కుదరదు.

మీ పని మీరు శ్రద్ధగా చేసుకోండి. ఫలితం రావచ్చు, రాకపోవచ్చు, ఫలితం కోసం ఎదురు చూడవద్దు. ఫలితం వస్తే మరల అది నా వలననే అయిపోయింది అనుకోవద్దు. ఫలితం నీ చేతిలో లేదు అని పనిమీద విరక్తి పెట్టుకోవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. మనం దారిన పోయేవాడు చెప్పిన మాటలు నమ్ముతాము కాని భగవంతుడు చెప్పిన మాటలు నమ్మము, దానికి మన బుద్ధిలో ఉన్న దోషం కారణం. పూర్వపుణ్యం లేకపోతే భగవంతుడు చెప్పిన మాటలను కూడా మన బుద్ధి విననివ్వదు. పూర్వజన్మలో సత్కర్మ చేయటం వలన మనకు ఈ దేహం వచ్చింది, సత్కర్మలు అనే డబ్బుతో మనం ఈ దేహాన్ని కొనుక్కొన్నాము. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సరిగా ఉపయోగించుకోకపోతే వెనుక జన్మలకు పంపించేస్తాడు. ఇప్పుడు మనకు భయం వేస్తోంది అనుకోండి, ఒకోసారి ఈ సమస్యను పరిష్కారం చేసుకోలేక మనస్సును డైవర్టు చేస్తాము, అది అయిపోయాక మరల మనకు భయం వచ్చేస్తుంది. అసలు దానికి కారణం ఏమిటి అని జాగ్రత్తగా చూసుకొని ఆ కారణాన్ని కట్ చేయాలి. ప్రపంచం అశాంతిగా ఉంది అంటారు ఏమీలేదు మనలో ఉన్న అశాంతే ప్రపంచంలో కనిపిస్తోంది. మనం శాంతిని డబ్బుతో కొనుక్కోలేము. నీకు చాలా డబ్బు ఉంది అనుకో స్థలాలు కొనుక్కోవచ్చు, విదేశాలకు వెళ్ళి కూడా టోక్యోలాంటి పెద్ద నగరాలలో కూడా స్థలాలు కొనుక్కోవచ్చుకాని నీ దగ్గర లక్ష కోట్లు డబ్బు ఉన్నా కూడా ఆ డబ్బుతో నీవు శాంతిని కొనుక్కోలేవు, శాంతికి విలువ కట్టలేము, డబ్బు ఉంది కదా అని నీవు వంద గుడులు కట్టినా నీకు శాంతి రాదు, అది వెలలేనిది, వెలలేని దానిని వెలపెట్టి ఎలా కొనుక్కోగలవు.

మనం టీ తాగుతున్నాము అనుకోండి ఒక మాదిరి వేడిని మన నాలుక తట్టుకొంటుంది, దానికి మించిన వేడిని నాలుక తట్టుకోలేదు. కొంతమంది ఎంతగ్రేట్‌గా ఉంటారు అంటే నరకంలో ఉన్న సఫరింగ్ అంతా వారికి వచ్చినా తట్టుకొంటారు. నరకంలో ఉన్న సఫరింగ్ ఓడిపోయి వెనక్కి వెళ్ళిపోతుంది. అందుచేత అటువంటి వారిని నరకానికి పంపరు, వారిని పంపితే నరకం మారిపోతుంది. తలకాయ లేనివాడికి తలపోటు రాదు, లోపల సఫర్ అయ్యేవాడు లేకపోతే ఇంక సఫరింగ్ ఉండదు. మీకు వెయ్యి పనులు ఉంటే వెయ్యి పనులు కూడా ప్రక్కకు పెట్టి మీరు టైముకు భోజనం చెయ్యండి. భోజనం చేసిన తరువాత మీరు ఆ పనులు చేసుకోండి

అని ఆయుర్వేద గ్రంథంలో ఒక మాట ఉంది. మనస్సుకు వేరుగా ఏమీ లేదు, దానిని తొలగించుకొంటే సరిపోతుంది. మనకు చిరాకువచ్చినా, దుఃఖం వచ్చినా, సంతోషం వచ్చినా మనస్సుకు వేరుగా రావు, మనస్సు లేకపోతే వాటికి అస్థిత్వం లేదు. ఈ గోడకు భయం వేస్తుందా? దానికి భయంలేదు అలాగని గోడ లేదా అంటే ఉంది ఎందుచేత నంటే అక్కడ ప్రాణం లేదు, మనస్సు లేదు. మనకు మనస్సు ఉంది, ప్రాణం ఉంది, శరీరం ఉంది కదా, కాని అవి మనం కాదు అని ఉపనిషత్ చెబుతోంది. మాధుర్యం మన హృదయంలోనే ఉంది, బయట ఎక్కడా మాధుర్యం లేదు. మన హృదయంలో ఉన్న మాధుర్యం కళ్లకు కనబడదు, చెవులకు వినబడదు లేదా అంటే ఉంది. ఒక వస్తువు నన్ను సుఖపెడుతోంది అనుకో, అది నిజమైతే అందరినీ సుఖపెట్టాలి కదా. నీ ఇష్టాన్ని బట్టి అలా ఉంది, నీ ఇష్టాన్ని తీసి ఒక ప్రక్కన పెడితే అందులో ఏమీలేదు. మన ఇష్టం వలన వస్తువు గొప్పగా ఉన్నట్లు అనిపిస్తుంది, ఇష్టాన్ని ప్రక్కన పెడితే గొప్పతనం లేదు. బయట సృష్టిలో ఎక్కడా మాధుర్యం లేదు, బయట ఉన్నది అంతా వట్టి గడ్డే, దాని మీద ఇష్టం వలన, ఎటాచ్‌మెంట్‌వలన ఎంత గొప్పగా ఉందో అనిపిస్తుంది. ఒకవేళ స్వర్గంలో మాధుర్యం ఉన్నా అది నీలో ఉన్న మాధుర్యానికి సరిపోదు. మీరు యం.ఎల్.ఏ., పదవి చేయాలి అనుకొంటున్నారు అనుకోండి, యం.ఎల్.ఏ., పదవి గొప్పగా ఉంది అనిపిస్తుంది, నీ ఇష్టాన్ని బట్టి అలా అనిపిస్తుంది. బయట ఏవైనా మధురక్షణాలు ఉన్నట్లు అనిపించినా అవి తుంపరలు మాత్రమే, వాటర్ నీవే. మనమే మాధుర్యం అయినప్పుడు ఇంక క్షణాల గొడవ ఎందుకు. ఆ క్షణాలకు మన హృదయంలో ఉన్న మాధుర్యం ఇచ్చి బాగున్నాయి అనుకొంటున్నాము.

చైతన్యం ఉంటుంది దానికి ప్రాణం లేదు, మనస్సు లేదు అలాగని అది లేదా అంటే ఉంది. చైతన్యం లేకుండా ప్రాణం, మనస్సు ఉండలేవు. మనస్సు, ప్రాణం లేకుండా చైతన్యం ఉంటుంది. బుద్ధుడి చర్మం టెండర్‌గా ఉంటుంది, స్మూత్‌గా ఉంటుంది, మొఖం లవ్‌లీగా ఉంటుంది, ఆయన బ్లడ్‌లో భయంలేదు. మన నీడను చూసి మనకు భయం కలుగుతుంది. మనకు ప్రయాణం సరదాగా ఉంది అనుకో, గమ్యానికి చేరిన తరువాత ఇంత తొందరగా వచ్చేసామా అనిపిస్తుంది. మనం యూనివర్శల్ అయిపోతే ప్లేస్ మారినా ఏమీ అనిపించదు. మనం హైదరాబాద్‌లో ఉన్నా, అమెరికాలో ఉన్నా ఏమీ అనిపించదు. మనకు జ్ఞానం రానప్పుడు మన శరీరం ఎక్కడ ఉంటే మనం అక్కడ ఉన్నాము అనిపిస్తుంది, జ్ఞానం వచ్చాక మనం అంతటా ఉన్నాము అని తెలుస్తుంది. పిల్లలు ఏడ్చినప్పుడు లక్కపిడతలు, బొమ్మలు ఇస్తే ఏడుపు ఆపేసి వాటితో ఆడుకొంటారు. అలాగే మనం ఆడుకోవటానికి నామ, రూపాలు పాడేసాడు దేవుడు. కొంతసేపు ఆడుకొన్నాక పిల్లవాడికి అమ్మ జ్ఞాపకం వచ్చినప్పుడు బొమ్మలు అన్నీ పడేసి అమ్మ దగ్గరికి చేరతాడు. అలాగే మనకి దేవుడు జ్ఞాపకం వచ్చినప్పుడు ఇవి అన్నీ వదిలేస్తాము అంతవరకు ప్రతీజన్మలోనూ ఈ నామరూపాలతో ఆడుకొంటాము. ఒకచేతితో పని చేసుకోండి,

ఇంకో చేతితో దేవుడిని పట్టుకోండి. పనిని మీ అంతట మీరు విడిచిపెట్టవద్దు, పనిని విడిచిపెట్టే ముహూర్తం ఆయన పెట్టుకొంటాడు, అంతేగాని కోపం వచ్చి పనిమాని వేయకూడదు. చదువు పూర్తి అయిన తరువాత శిష్యులు వెళ్లేటప్పుడు గురువుగారు ఏమి చెపుతున్నారు అంటే, లోకం ప్రమాదం మీరు జాగ్రత్తగా ఉండండి. నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నానో లోకం అలా చూడదు జాగ్రత్తగా ఉండండి. అసహనం పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు, అగౌరవం పనికిరాదు, అవినయం పనికిరాదు అని చెప్పాడు. మీ చేతికి ఉన్న వాచ్ ఎవడైనా పట్టుకొని పోయాడు అనుకోండి, వాడిది ఎంత తప్పో మీది కూడా అంతే తప్పు, మీ అజాగ్రత్తవలన పట్టుకొని పోయాడు అందువలన అజాగ్రత్త పనికిరాదు. సృష్టిలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కొన్ని నీకు ఇష్టం ఉండవచ్చు, కొన్ని నీకు ఇష్టం లేని సంఘటనలు జరుగుతాయి, అలాగని మీ సహనం పోగొట్టుకోవద్దు, అసహనం పనికిరాదు. చదువుతో పాటు ఇవి అన్నీ చెప్పి పంపాడు, వాడు గురువు. సోక్రటీసును విషం పెట్టి చంపారు. ముందురోజు జైలునుండి పారిపోదామని ఆయనతో ఉన్నవారు సోక్రటీసుతో చెపుతారు, ఆయన ఏమి చెప్పాడు అంటే "యు టు లివ్, ఐ టు డై" అన్నాడు అంటే మీరందరూ బతికి ఉండండి, నేను చనిపోతాను, అది ఈశ్వర నిర్ణయం. సోక్రటీసును చూడటానికి చాలామంది వచ్చేవారు. మిమ్మల్ని చూడటానికి ఇంతమంది వస్తున్నారు, మమ్మల్ని చూడటానికి ఎవరూ రావటం లేదు అని సోక్రటీసును అడిగితే నాకు ఏమీ తెలియదు అన్న సంగతి నాకు తెలుసు అందుకే అందరూ చూడటానికి వస్తున్నారు అన్నాడు. మాకు అన్నీ తెలుసును అని మీరు అనుకొంటున్నారు ఇంకెవరు చూడటానికి వస్తారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-09-05, యానాం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మీకు అందరికీ జ్ఞానం కలుగుతుంది, సుఖం తెలుస్తుంది. సబ్జెక్టు మాత్రం బాగా అర్థం చేసుకోండి. ఎప్పుడైనా మిమ్మల్ని సొంతబుద్ధి సుఖపెడుతుంది కానీ పరాయిబుద్ధి మిమ్మల్ని సుఖపెట్టదు. మీరు వివేకం పెంచుకోవాలి, పరిస్థితులను అర్థం చేసుకోవాలి. మనం ఎంతో కొంత వివేకంతోటి, పుణ్యబలంతోటి ఈ ప్రపంచంలోనికి వచ్చాము. మనం పూర్వజన్మలలో పుణ్యకర్మలు చేయటం వలన ఆధనం పెట్టి మనం ఈశరీరాన్ని కొనుక్కొన్నాము. మనకు ఈ మానవదేహం రావటం, ఆత్మజ్ఞానం సముపార్జించాలనే కాంక్ష రావటం, బుద్ధిసూక్ష్మత రావటం ఇవన్నీ పూర్వజన్మలలో మనం చేసినటువంటి సత్కర్మల ఫలితం, వాటితో ఇది కొనుక్కొంటే వచ్చింది కాని వూరికే రాలేదు. మనలోపల అంతర్యామిగా పరమాత్మ ఉన్నాడు, ఆయనను కాదని మనం చేసేది ఏమీలేదు. మనకు స్థూలశరీరం, సూక్ష్మశరీరం ఉన్నాయి. స్థూలశరీరం స్మశానంలో కాలిపోతుంది, సూక్ష్మశరీరం మనకూడా వస్తుంది. స్థూలశరీరం మరణించేలోపు సూక్ష్మశరీరాన్ని ఎంతవరకు బాగుచేసుకోగలిగితే అంతవరకు